సాక్షి
వికారాబాద్
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



హద్దుల్లేని అక్రమ రవాణా

తెలంగాణ-కర్ణాటక సరిహద్దు అక్రమాలకు అడ్డాగా మారింది. ఇక్కడ పోలీస్ చెక్‌పోస్ట్ ఉన్నా.. నిరుపయోగంగా మారింది. 8లో▸



కాపాడండి

వీధికుక్కల నుంచి రక్షణ కల్పించాలని మంగళవారం అధికారులకు గ్రామస్తులు వినతిపత్రం అందచేశారు. 8లో▸



ఉపాధికోసం ఆరాటం

మోమిన్‌పేట మండల కేంద్రంలో నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు చివరి దశలో ఉన్నాయి. 9లో▸

గడువు రెండు రోజులే

- కొనసాగుతున్న గృహజ్యోతి, రూ.500 గ్యాస్ దరఖాస్తుల స్వీకరణ
- రేపటితో ముగియనున్న గడువు
- తెల్ల రేషన్ కార్డే ప్రామాణికం అంటున్న అధికారులు
- విద్యుత్ సర్వీస్ నంబర్‌కు ఆధార్, రేషన్, ఫోన్ నంబర్‌తో అనుసంధానం



ఉచిత విద్యుత్ కోసం వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలుపై వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు అవుతుండగా.. గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిచడం, రూ.500కు వంటగ్యాస్ అందించేందుకు అవసరమైన వివరాలను వినియోగదారుల నుంచి సేకరిస్తోంది. ఈ రెండు పథకాల అమలుకు తెల్ల రేషన్ కార్డును ప్రమాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఆయా పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు విద్యుత్, పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన మొదలుపెట్టారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డాటా వెరిఫికేషన్‌ను వారు ప్రారంభించారు.

మూడు లక్షలకు పైగా దరఖాస్తులు

ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 19 మండలాల నుంచి 3,14,090 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారే అర్హులను ప్రభుత్వం

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు	3,14,090
జిల్లాలో తెల్ల రేషన్ కార్డులు	2,41,350
జిల్లాలో వంట గ్యాస్ కనక్షన్లు	2,08,000
జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు	2,10,000
200 యూనిట్ల లోపు వినియోగదారులు	1,20,000 (అంచనా)

నిర్ణయించింది. జిల్లాలో 2,41,350 ఆహార భద్రత కార్డులు ఉండగా వీటిలో 26,865 అంత్యోదయ అన్నయోజన కార్డులు ఉన్నాయి.

ఆధార్, రేషన్ కార్డుతో అనుసంధానం..

జిల్లాలో 2,10,000 విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇందులో 1,20,000 వరకు గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం ఇప్పటివరకు 1,10,000 మంది తెల్ల రేషన్ కార్డుదారులను గుర్తించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వారం రోజులుగా విద్యుత్ సిబ్బంది వినియోగదారుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. వివరాల సేకరణకు ఈనెల 15 చివరి తేదీ కావడంతో మరో 10వేల వరకు సంఖ్య పెరగవచ్చని అంటున్నారు. ప్రతీనెలా జిల్లాలో 1వ తేదీ నుంచి 15వరకు మొబైల్ విద్యుత్ బిల్లింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్లు ఉచితంగా పొందాలనుకునే వ్యక్తి ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, మొబైల్ నంబర్‌ను విద్యుత్ మీటర్ సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేస్తున్నారు.

డెలివరీ బాయ్ ద్వారా వివరాల సేకరణ..

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు 2,08,000 వరకు ఉన్నాయి. ఇందులో 10,250 కమర్షియల్ కనెక్షన్లు ఉండగా మిగతావి గృహ వినియోగానికి ఉపయోగించేవి. రూ.500కు గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తులు పెద్ద మొత్తంలోనే ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించి డెలివరీ బాయ్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. కేవైసీ తరహాలో లబ్ధిదారుల వివరాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు నంబర్లను తీసుకుంటున్నారు. వారి ఆర్థిక స్థితిగతులను అంచనా వేసేందుకు కుటుంబ వివరాలను కూడా తీసుకుంటున్నారు. గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారులకు కుటుంబానికి ఏడాదికి 6 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చే అవకాశం ఉంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు మాత్రమే అమలు చేయాల్సి వస్తే భారీగా కోత విధించే అవకాశాలు ఉన్నాయి. లబ్ధిదారుడి ఆర్థిక స్థితిగతుల ఆధారంగా కూడా ఎంపిక చేసే అవకాశాలున్నట్లు తెలస్తోంది. మొత్తానికి దరఖాస్తుల వడపోత ప్రారంభమైనట్లే కన్పిస్తోంది. అయితే ఈ రెండు పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.



ఇసుక ట్రాక్టర్లు రాకుండా గ్రామ ప్రధాన రోడ్డుపై వేసిన కట్టెలు

మా ఊరిలోకి ఇసుక ట్రాక్టర్లు రానివ్వం

- ప్రధాన రోడ్డుపై కట్టెలు పెట్టి ఖాంజాపూర్ గ్రామస్తుల నిరసన
- అతివేగంగా వెళ్తున్నారని, భూగర్భజలాలు అడుగంటుతున్నాయని ఆవేదన

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఖాంజాపూర్ వాగు నుంచి ఇసుక అనుమతి ఇవ్వొద్దని ప్రభుత్వాధికారులను గ్రామస్తులు కోరుతున్నారు. ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుండటంతో గ్రామంలో ఇళ్ల ముందు ఆడుకునేందుకు పిల్లలు భయపడుతున్నారన్నారు. జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. వాహనాలను అతివేగంగా నడపవద్దని గ్రామ మాజీ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. నెలరోజుల క్రితం తాండూరు రెవెన్యూ అధికారులు వివిధ అభివృద్ధి పనులకు ఖాంజాపూర్ వాగు నుంచి ఇసుక అనుమతి ఇచ్చారు. ఒక్కో ట్రాక్టర్ రూ.600 కలెక్టర్ పేరు మీద డీడీ తీసి ఇసుకను తరలిస్తున్నారు. అయితే నాలుగు ట్రిప్పులు పర్మిషన్ తీసుకోని పదుల సంఖ్యలో ఇసుకను తరలిస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం..

ఖాంజాపూర్ వాగు నుంచి ఇసుక అనుమతి ఇవ్వొద్దని తాండూరు రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కోరుతున్నారు. వాగు నుంచి ఇసుక తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ యజమానుల నుంచి రెవెన్యూ అధికారులు డబ్బులు వసూలు చేసి పర్మిషన్లు ఇస్తున్నారని ఆరోపణలున్నాయి. గ్రామానికి చెందిన కొందరు నాయకులు కూడా ఇసుక మాఫియాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇలాగే కొనసాగితే రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

మున్సిపల్ కమిషనర్‌గా విక్రమ్‌సింహారెడ్డి



తాండూరు: తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా విక్రమ్ సింహారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ అధికారుల బదిలీలు జరుగుతున్నాయి.ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసు, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారుల బదిలీలు జరిగాయి. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేశారు. ఈ క్రమంలో వనపర్తి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న విక్రమ్‌సింహారెడ్డిని తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. 2017 సంవత్సరంలో తాండూరు మున్సిపాలిటీలో కొన్నాళ్లపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విక్రమ్‌సింహారెడ్డి విధులు నిర్వహించారు. తర్వాత డిప్యూటేషన్‌పై జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. తర్వాత వనపర్తి మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లారు. అక్కడి నుంచి తాజాగా తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం కమిషనర్‌గా భాధ్యతలు నిర్వహిస్తున్న షఫీఉల్లాకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ఎలాంటి భాధ్యతలు అప్పగించలేదు.

రేపు జాబ్‌మేళా

వికారాబాద్ అర్బన్: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో సుమారు 150 ఉద్యోగాల కోసం అర్హులైన వారిని ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. ఫార్మసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్లు, ట్రినీల పోస్టులకు.. బీ-ఫార్మసి, యం-ఫార్మసీతో పాటు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు ఉన్న యువతీయువకులు అర్హులన్నారు. ఉదయం 10:30 గంటలకు జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం వద్ద హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 96760 47444 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించుటకు గెస్ట్ లెక్చరర్ నియమకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజారాం మంగళవారం ఒక ప్రటకనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ పూర్తిచేసిన వారు..ఎస్సీ,ఎస్టీలు 50శాతం, ఇతరులు 55శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97017 74143 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు

ఆఫ్తాల్మిక్ అధికారి డాక్టర్ హరినాథ్



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హరినాథ్

కొడంగల్ రూరల్: కంటిచూపు లోపించిన వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని ఆఫ్తాల్మిక్ అధికారి డాక్టర్ హరినాథ్ నెహ్రూ అన్నారు. మంగళవారం కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో 35 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం ఎనుగొండ కంటి ఆస్పత్రికి తరలించారు. 6 మందికి బీపీ, 5 మందికి షుగర్ ఉన్నట్లు గుర్తించామని.. వీరిని తర్వాతి శిబిరంలో ఆపరేషన్ కోసం పంపించనున్నట్లు హరినాథ్‌నెహ్రూ తెలిపారు.

ప్రతీ మంగళవారం పీహెచ్‌సీలో ఆరోగ్యమేళా

వైద్యాధికారి సుజల

మోమిన్‌పేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళలకు ఆరోగ్య మేళా నిర్వహిస్తున్నామని వైద్యాధికారి సుజల పేర్కొన్నారు. మోమిన్‌పేటలోని పీహెచ్‌సీలో మంగళవారం ఆమె మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి వారం మహిళలకు సంబంధించి అన్నిరకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. దీనికి తోడు నెలలో ఒకసారి మానసిక వైద్యుడు వచ్చి పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. సబ్ సెంటర్లతో పాటు మండల పరిధిలోని వెల్‌చాల్, కేసారం, టేకులపల్లి, దేవరంపల్లి, అంరాధి కలాన్, మేకవనంపల్లి గ్రామాల్లో హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో కూడా వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజు ఆ కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉంటున్నారన్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో ఓపీ తగ్గిందని తెలిపారు. వైద్య సిబ్బంది ఉన్నారు.



బదిలీపై వెళ్తున్న అధికారులను సన్మానించిన కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాసేవలోనే అసలైన సంతృప్తి

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తే కలిగే సంతృప్తి వెలలేనిదని కలెక్టర్ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. బదిలీలపై వెళ్తున్న పలువురు జిల్లా అధికారులకు మంగళవారం కలెక్టరేట్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉద్యోగులకు బదిలీలు సహజమని అన్నారు. బదిలీపై వెళ్తున్న సీఈఓ జానకిరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిని, డీపీఓ తరుణ్ కుమార్, డీఆర్‌డీఓ క్రిష్ణణ్, డీడబ్ల్యూఓ లలితకుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర, డీఎల్‌పీఓ అనితను.. కలెక్టర్, అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అధికారులు ఘనంగా సన్మానించారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

- ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సునీతామేరి

అనంతగిరి: ఆంగ్లభాషపై పట్టు సాధించాలని ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సునీతామేరి అన్నారు. వికారాబాద్‌లోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో ఎల్టా ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. డ్రామా విభాగంలో జెడ్పీహెచ్ఎస్ కొంశెట్టిపల్లి ప్రథమస్థానంలో నిలిచింది. స్పెల్ విజార్డ్‌లో జెడ్పీహెచ్ఎస్ మేకవనంపల్లి పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. అనంతరం నిర్వాహకులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నేటి ప్రపంచంలో ఆంగ్ల భాషలో రావీణ్యం చాలా కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం రాజశేఖర్, శ్రీశైలం, ప్రేంకుమార్‌గౌడ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకు సాగండి

- పరీక్షలంటే భయం వీడండి
- విద్యతోనే అభివృద్ధి
- రంగారెడ్డి డీఈఓ సుశీందర్‌రావు



మానసిక నిపుణుడు డాక్టర్ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు తదితరులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ప్రణాళికలను రూపొందించుకొని చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో మంగళవారం ఎంఈఓ శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక నిపుణుడు డాక్టర్ లక్ష్మణ్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని సూచించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, భవిష్యత్‌లో ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి లక్ష్యసాధనకోసం నిరంతరం శ్రమించాలని అన్నారు. పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. సమయాన్ని వృథాచేయకుండా చదువుపై ధ్యాస పెడితే మంచి ఉత్తీర్ణతను సాధిస్తారని పేర్కొన్నారు. మానసిక నిపుణుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కలలు కనడం మాత్రమే కాకుండా ఆ కలలను నిజం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఆలోచనలను ఆచరణలో పెట్టి సరైన నిర్ణయాలతో ముందుకు సాగితే విజయాలు సొంతమవుతాయని అన్నారు. సరైన ఆలోచనలు, సరైన నిర్ణయాలు, సరైన పని, సరైన సాధన చేస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంఈఓలు కృష్ణారెడ్డి, మనోహర్, ఉపాధ్యాయులు గౌరీశంకర్, పాండురంగయ్య, హస్నొద్దీన్, ప్రకాష్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

చేవెళ్ల: పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను మొదటిస్థానంలో నిలపాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకోసం ప్రత్యేక తరగతులు నిర్వహించటం జరుగుతుందని చెప్పారు. మానసిక నిపుణుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్టంతో చదవాలని పేర్కొన్నారు. భయపడకుండా ప్రశాంతంగా ఉండి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, విషయ నిపుణులు అక్బర్,కల్పన, సోలోమాన్,నాగేశ్‌బాబు, మహిపాల్‌రెడ్డి, రియాజ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెత్తురోడుతోంది

- హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- అతివేగం కారణంగా గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం



హన్మన్‌గండి సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జైన బైక్, ప్రమాదంలో గాయపడిన వ్యక్తి (ఫైల్)

పరిగి: హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి నెత్తురోడుతోంది. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారి వినియోగానికి టోల్‌గేట్ల ద్వారా వాహనదారుల నుంచి ట్యాక్స్‌ల రూపంలో రూ.లక్షల్లో వసూలు చేస్తున్నా రోడ్డు భద్రత విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలతో వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగే ప్రమాదాలకు కారణమని స్థానికులు చెబుతున్నారు.

నియంత్రణ చర్యలేవి..?

జాతీయ రహదారి ఎన్‌హెచ్-163 రెండు వరుసలతో రోడ్డు నిర్మించినప్పటికీ మన్నెగూడ నుంచి తుంకిమెట్ల వరకు నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు భద్రత విషయంలో తమకేమీ పట్టనట్లుగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. రోడ్డు, రవాణా శాఖ అధికారులు జాతీయ రోడ్డుపై నిత్యం వాహనాలను ఆపి పత్రాలను పరిశీలించి చలాన్లు విధించడం వంటివి చేస్తున్నారే తప్పా ప్రమదాల నివారణ చర్యలు మాత్రం చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. రోడ్డు ప్రమాదాలపై స్థానిక పోలీసులు, రోడ్డు రవాణా అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

కానరాని సూచిక బోర్డులు..

ప్రమదాలు జరగకుండా ప్రమద హెచ్చరికల బోర్డులు, రేడియం స్టిక్కర్లు, రాత్రివేళల్లో వెలుతురు ఉండేలా చూడటం, యూటర్న్‌లు, మార్కింగ్‌లు, నిరంతరం రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. తరచూ ప్రమాదాలు జరిగే చోట ప్రత్యేక చర్యలు, ఏమైనా రోడ్డు నిర్మాణ లోపాలు జరిగాయా, డివైడర్లు ఏర్పాటు తదితర వాటిని పరిశీలించి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. జాతీయ రోడ్డుపై ప్రమాదాలు జరిగితే ఎలాంటి సేవలను ప్రయాణికులు వినియోగించుకోవాలనే విషయాలను పోలీసు అధికారులు, ఆర్టీఏ అధికారులతో ప్రజలకు అవగాహన కల్పించాలి. రోడ్డు ప్రమదాలపై ప్రతిఏటా రోడ్డు భద్రత కోసం ప్రత్యేక నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేస్తుంది. అయినప్పటికీ అధికారులు మాత్రం రోడ్డు ప్రమాదాల నిరవాణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు

- పరిగి మండల పరిధిలో కూడా ఇటీవల నిత్యం రోడ్డు ప్రమదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదం జరిగినప్పుడల్లా ఒకరిద్దరు మృత్యువాత పడుతూనే ఉన్నారు. పూడూర్ మండలం మన్నెగూడ నుంచి బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం వరకు ప్రతిరోజు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా.. పోలీసులు, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.
- ఈ నెల 1న మండల పరిధిలోని పోల్కంపల్లికి చెందిన సాయితేజ (22), శివ (21) బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై అక్కడిక్కడే ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.
- ఈనెల 9న మండల పరిధిలోని హన్మన్‌గండీ సమీపంలో తాండూర్ మండలం గొల్లచెరువుకు చెందిన ఎండీ.రజాక్ (32) గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతోతో తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు
- ఈనెల 11న మండల పరిధిలోని గండిసంగాపూర్ సమీపంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసి వస్తుండగా లారీ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే తేదీన మండల పరిధిలోని రంగంపల్లి గేట్ సమీపంలో బైక్ ట్రాక్టర్ ఢీకొని గ్రామానికి చెందిన నరేష్(20) మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.
- అదేరోజు బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం సమీపంలో బుర్హుఖాన్‌పల్లికి చెందిన కృష్ణ (35) రోడ్డుపై ఆగిఉన్న లారీని ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.
- ఇలా ప్రతినిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

పరిగి మండలంలోని హన్మన్‌గండి, గడిసింగాపూర్, రంగంపల్లి గ్రామాలు, బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామ సమీపంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడానికి తోడు ప్రమాదాల నిరవాణరకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

బోరుబండి పల్టీ



పంట పొలంలో పడిపోయిన బోరు వాహనం

కుల్కచర్ల: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన బోరుబండి, అదుపు తప్పి పల్టీలుకొట్టింది. సంఘటన మక్తవెంకటాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన కొత్తకాపు చైతన్యరెడ్డి తన బోరుబండితో మక్తవెంకటాపూర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపు తప్పి, పల్టీలు కొడుతూ.. పంటపొలంలో పడిపోయింది. ప్రమాద సమయంలో వాహనంలో ఉన్న నలుగురు వ్యక్తులు.. స్వల్పగాయాలతో బయట పడ్డారు.

గురుకుల ఫలితాల్లో మెరిసిన గిరిజన బిడ్డలు



భరత్ కుమార్



కొర్ర ప్రమీల

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల ఫలితాల్లో మండల వాసులు ప్రతిభను చాటారు. బయోసైన్స్ విభాగంలో టేకుల తండా ఎత్తుకాల్వ తండాకు చెందిన భరత్ కుమార్.. 71ర్యాంకు సాధించి, ప్రభుత్వ ఉద్యోగాన్ని దక్కించుకున్నాడు. అదే విధంగా మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన కొర్ర ప్రమీల పీజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగం పొందారు. మంగళవారం జరిగిన సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌లో వీరికి సర్కారు కొలువులు దక్కాయి. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు



హరీశ్(ఫైల్)

యాలాల: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగాడు. ఈ ఘటన మండల పరిధి అన్నసాగర్ ఊరచెరువులో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంగి హరీశ్(25) కూలీపనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవాడు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన కొందరితో కలిసి ఊరచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులోకి దిగిన హరీశ్.. ప్రమాదవశాత్తు నీటమునిగాడు. గమనించిన గ్రామస్తులు విషయాన్ని కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి తాండూరు అగ్నిమాపక, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో చెరువులో మృతదేహం కోసం గాలింపు చేపట్టారు. సాయంత్రం వరకు మృతదేహం ఆచూకీ లభించలేదు. గజ ఈతగాళ్లతో గాలింపు చేపడుతున్నట్లు అధికారులు తెలిపా రు. మృతుడికి భార్య శ్రీలత, ఏడాది వయసున్న కూతురు ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దోమ: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూర్ గ్రామానికి చెందిన ఎర్రగడ్డపల్లి కృష్ణయ్య(25) గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది, పొలానికి వెళ్లి పురుగు మందు సేవించాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స కోసం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించిందని, హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. గాంధీలో చికిత్స పొందుతూ కృష్ణయ్య మంగళవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు సత్యయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హద్దుమీరిన అక్రమ రవాణా

కర్ణాటక నుంచి తెలంగాణకు భారీగా మత్తుపదార్థాల చేరవేత

- పెట్రోల్, డీజిల్ తరలిస్తూ అక్రమార్జన
- సరిహద్దులో సోదాలు శూన్యం
- పట్టించుకోని అధికారులు





కర్ణాటక-తెలంగాణ సరిహద్దు (ఇన్‌సెట్లో) ఇంటర్ స్టేట్ బార్డర్ పోలీస్ చెక్‌పోస్ట్ గదికి తాళం

తాండూరు రూరల్: తెలంగాణ-కర్ణాటక సరిహద్దు అక్రమాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ఇంటర్ స్టేట్ బార్డర్ పోలీస్ చెక్‌పోస్ట్ ఉన్నా.. అది నిరుపయోగంగా మారింది. తనిఖీ చేయాల్సిన అధికారులు పత్తా లేకుండా పోయారు. కేవలం ఎన్నికల సమయాన హడావుడి చేస్తున్నారు. ఆ తరువాత చెక్‌పోస్టుకు తాళం వేస్తున్నారు. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు.. ఈ మార్గం గుండా యథేచ్ఛగా పక్క రాష్ట్రం నుంచి ఇక్కడికి నిషేధిత మత్తు పదార్థాలు, తదితర వాటిని చేరవేస్తున్నారు.

పెట్రోల్, డీజిల్

తాండూరు మండలం కోత్లాపూర్ గ్రామ సరిహద్దు వద్ద తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ఉంది. దీని వెంబడి కర్ణాటక గ్రామాలైన మిర్యాణ్, కల్లూర్ ఉన్నాయి. కోత్లాపూర్ సరిహద్దున పోలీసు ఉన్నతాధికారులు చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్, ఎక్సైజ్, మార్కెటింగ్ శాఖ అధికారులు నిత్యం సోదాలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఒక్క అధికారి కూడా లేరు. దీంతో స్మగ్లర్లు.. అడ్డూఅదుపూ లేకుండా.. కర్ణాటక నుంచి భారీగా గుట్కా, మద్యంతో పాటు పెట్రోల్, డీజిల్‌ను తెలంగాణకు తరలిస్తూ.. అక్రమార్జనకు తెగబడుతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

కర్ణాటకలో సరిహద్దు గ్రామమైన మిర్యాణ్‌లో భారీగా నాపరాతి గనులు ఉన్నాయి. ఈ నాపరాతిని రోజూ వందల లారీల్లో తాండూరుకు చేరవేస్తున్నారు. కర్ణాటక సరిహద్దు దాటి తెలంగాణ రాష్ట్రానికి వస్తే 'రాయల్టీ' చెల్లించాలి. కానీ ఎలాంటి రాయల్టీ లేకుండానే నాపరాతిని తరలిస్తున్నారు. డబ్బుంటే చాలు డాక్యుమెంట్లతో పని లేదన్నట్లుగా.. మాఫియా రెచ్చిపోతుండగా.. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఈ అక్రమ రవాణాతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి ఏటా రూ. కోట్లలో గండీ పడుతోంది. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

'మేడం.. మీ వెంటే మేము'



సునీతారెడ్డిని కలిసిన మండల నాయకులు

యాలాల: పట్నం ఇంటికి బీఆర్ఎస్ నేతలు బారులు తీరుతున్నారు. ఇటీవల మహేందర్‌రెడ్డి దంపతులు సీఎం రేవంత్‌ను కలిసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో వారు కాంగ్రెస్‌లో చేరనున్నారన్న సమాచారంతో.. పట్నం అనుచరులు విడతల వారీగా.. ఆ కుంటుబ సభ్యులను మర్యాద పూర్వకంగా కలిసి, మీ వెంటే మేముంటామంటూ స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని గులాబీ శ్రేణులు కలిశారు. 'మేము బీఆర్ఎస్ పార్టీని వీడి, కాంగ్రెస్‌లో చేరతామని' చెప్పినట్లు తెలిసింది. ఆమెను కలిసిన వారిలో సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు, బెన్నూరు ఎంపీటీసీ లక్ష్మప్ప, మాజీ ఎంపీటీసీలు రాజు, శరణుభూపాల్, మాజీ సర్పంచ్ రాఘవేందర్‌రావు, యాదవరెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి శివారులో ఉన్న వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో చోరీ చేసిన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరు మండలం మిట్టబాసుపల్లికి చెందిన రాథోడ్ సంతోష్ నాయక్ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం రాత్రి ఇతను వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో దొంగతనానికి పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సంతోష్ నాయక్‌కు పట్టుకొని విచారించగా నేరం అంగీకరించాడని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురికి..

మీర్‌పేట: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి నందనవనం లక్కీ హోటల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నందనవనం వాంబే కాలనీకి చెందిన కమ్మే దేవానంద్, మొహమ్మద్ ఖలీల్, కాకం రాజశేఖర్‌లు ఆటోలో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ మేరకు పోలీసులు వారి వద్ద నుంచి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

మైసమ్మ ఆలయంలో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న సీఐ

కొత్తూరు: పట్టణంలోని భవానీనగర్ కాలనీలో ఉన్న మందోస్‌బాయి మైసమ్మ ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ ధర్మకర్త విశ్వం, స్థానికుల వివరాల మేరకు.. ఉదయం ఆలయ తలుపులు ధ్వంసం చేసి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలో పరిశీలించగా దేవతామూర్తులకు అలంకరించేందుకు భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలతో పాటు హుండీలోని నగదును దోచుకెళ్లినట్లు ధర్మకర్త వివరించారు. అనంతరం సీఐ ఆలయాన్ని పరిశీలించి చోరీ జరిగిన తీరును ఆరా తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కంటి సమస్యలను అరికట్టాలి

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు



చిన్నారికి ఔషధం వేస్తున్న వైద్యులు

హుడాకాంప్లెక్స్: పిల్లల కంటి సమస్యల నివారణకు విటమిన్-ఏ ఎంతగానో దోహదపడుతుందని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సరూర్‌నగర్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విటమిన్-ఏ చుక్కల మందు పంపిణీని ఆయన ప్రారంభించారు. మొదటిరోజు తొమ్మిది నెలల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఈ ఔషధాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిల్లలకు సంభవించే రేచీకటి, ఇతర కంటి జబ్బులను నివారించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో, అంగన్‌వాడీ కేంద్రాలలో ద్రావణం పంపిణీ ఉంటుందన్నారు. పిల్లలకు తప్పనిసరిగా ఇప్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్వర్ణలత, జిల్లా ఉప వైద్యాధికారి వినోద్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అర్చన పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థికి స్వర్ణం



బంగారు పతకం సాధించిన వైష్ణవి

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వైష్ణవి రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో అండర్-14 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడంలోని తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వంద మీటర్ల విభాగంలో వైష్ణవి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అదే విధంగా 400 మీటర్లలో మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. హెచ్‌ఆర్ ఆర్ వెస్ట్ రీజియన్ ఆర్‌సీవో శారదావెంకటేష్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపక బృందం విద్యార్థికి అభినందనలు తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

మీర్‌పేట: మహిళ మెడలోని గొలుసు తెంచుకుని పారిపోయిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. గుర్రంగూడ టీచర్స్‌కాలనీకి చెందిన బోయపల్లి సంధ్యారాణి గృహిణి. ఆమె పని నిమిత్తం దేవరకొండకు వెళ్లి సోమవారం రాత్రి 9 గంటలకు ఆర్టీసీ బస్సులో వచ్చి గుర్రంగూడ బస్టాప్‌లో దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుంది. యాక్టివ వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 3.5 తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాన్ని పరిశీలించిన అధికారులు



గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీవో సూరజ్ కుమార్

అడ్డుకున్న మామిడిపల్లి గ్రామస్తులు

పహాడీషరీఫ్: రోడ్డు విస్తరణలో భాగంగా మామిడిపల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని తొలగించే విషయమై పరిశీలించేందుకు వచ్చిన అధికారులను గ్రామ యువకులు అడ్డుకున్నారు. గ్రామంలోని వివేకానంద చౌరస్తా నుంచి సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ మీదుగా వేస్తున్న నూతన రహదారి పక్కన ఉన్న ఆలయాన్ని తొలగించాలని జీఎంఆర్ సంస్థ ఫిర్యాదు మేరకు.. మహేశ్వరం ఆర్డీవో సూరజ్ కుమార్, బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డిలు ఆలయం వద్దకు మంగళవారం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్ గౌడ్ అక్కడికి చేరుకొని పురాతన ఆలయాన్ని కూల్చరాదని డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను గుర్తించి, ఆలయాన్ని యథావిధిగా ఉంచాలన్నారు. మరోచోట ఆలయం నిర్మించి ఇస్తామని జీఎంఆర్ అధికారులు భక్తులకు వివరించారు. అనంతరం సర్వే నంబర్ 99/1లో వెలసిన అక్రమ నిర్మాణాలను కూడా అధికారులు పరిశీలించారు. ఆయా నిర్మాణాలను త్వరలోనే కూల్చివేస్తామని తెలిపారు.

గొర్లపై దాడి చేసింది హైనానా, పులా?

జీవాల మందపై గుర్తుతెలియని జంతువు దాడి

- 49 గొర్లు మృతి, మరో పదింటికి తీవ్రగాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పశువైద్యాధికారి



మృతి చెందిన గొర్రెలు

దోమ: గొర్రెల మందపై గుర్తు తెలియని జంతువులు దాడి చేసి, 49 జీవాలను కొరికి చంపేసిన సంఘటన దోమ మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపల్లి గ్రామానికి చెందిన కుంట చిన్న మల్లయ్య తన 70 గొర్రెలను మేత కోసం సోమవారం అడవిలోకి తీసుకెళ్లాడు. అనంతరం సాయంకాలం దొడ్డిలో వదిలారు. రాత్రి వేళలో గుర్తు తెలియని జంతువులు వాటిపై దాడి చేశాయి. ఈ ఘటనలో 49 గొర్రెలు చనిపోగా.. 10 తీవ్రంగా గాయపడ్డాయి. దీంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. గొర్రెల విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని రైతు వాపోయాడు.

జిల్లా పశువైద్యాధికారి పరిశీలన

విషయం తెలుసుకున్న జిల్లా పశువైద్యాధికారి అనిల్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాడి విషయమై ఆరా తీశారు. ఈ సందర్భంగా చనిపోయిన, గాయపడిన జీవాల వివరాలను సేకరించారు. నష్టపోయిన రైతును ఆదుకునేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

భయాందోళనలో రైతులు

గొర్రెలపై గుర్తు తెలియని జంతువులు దాడికి పాల్పడడంతో స్థానిక రైతులు భయాందోళనకు గురయ్యారు. పెద్ద మొత్తంలో జీవాలు మృత్యువాత పడటంతో.. దాడికి పాల్పడింది హైనా లేదా పులా అని అనుమానం వ్యక్తంచేశారు. పూర్తి స్థాయిలో అధికారులు విచారణ చేపట్టి, బాధిత రైతును ఆదుకోవాలని కోరారు.

కుక్కల బారి నుంచి కాపాడండి





జీపీ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు (ఇన్‌సెట్లో) కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

పెద్దేముల్: వీధి కుక్కల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందచేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువయిందని, రోడ్లు, వీధుల్లో ఒంటరిగా వెళ్లే వారిపై గ్రామ సింహాలు దాడి చేస్తున్నాయని తెలిపారు. ఈ నెల 12న పెద్దేముల్‌కు గ్రామానికి చెందిన శ్రీనివాస్ కుమారుడు అభినేష్(6), రోజులాగే పాఠశాల నుంచి మధ్యాహ్నం ఇంటికి వెళ్తుండగా.. ఆ బాలుడుపై కుక్కలు దాడి చేసి, తీవ్రంగా గాయపర్చినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆ విద్యార్థిని చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. ఇందులో టీపీసీసీ మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, మాజీ వార్డు సభ్యులు మల్లేశం, ఫయాజ్, స్థానికులు శ్రీనివాస్, గోపాల్, జమీల్, చందు తదితరులు ఉన్నారు.

ధ్యానం దినచర్య కావాలి

పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్త ఆంజనేయరెడ్డి



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి

దోమ: నిత్య జీవితంలో ధ్యానం దినచర్యగా అలవర్చుకోవాలని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్త ఆంజనేయరెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని ఊటుపల్లి, బ్రహ్మణపల్లి, బుద్లాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో మంగళవారం గ్రామస్తులకు ధాన్యంపై ఆయన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానాన్ని దినచర్యగా అలవర్చుకుంటే తలనొప్పి నుంచి క్యాన్సర్ వరకు ఉండే రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు. ప్రమాదకరమైన గుండె జబ్బులు, కిడ్నీ, బీపీ, షుగర్ వంటి వ్యాధులను బాగుచేసుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థి దశలోనే ధ్యానం చేయడం ద్వారా మేధాశక్తి పెరిగి ఏకాగ్రత మెరుగవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిగి తాలూకా బాధ్యులు నవీన్, పిరమిడ్ సంస్థ సభ్యులు శోభిత, గుండం శైలజ, రాధ, రాంచంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న కొండా, నాయకులు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దోమ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. దోమ మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలంటూ మంగళవారం అవగాహన కల్పించారు. రైతులకు, కొనుగోలుదారులకు ఉచితంగా జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ.. ప్రకృతి సమతుల్యత కాపాడటం కోసం ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని కోరారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం, ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించినప్పుడే పర్యావరణ పరిరక్షణను కాపాడిన వాళ్లం అవుతామని చెప్పారు. ప్రతిఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, నర్సింహులు, శేరిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి



న్యాయయాత్రలో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి

కేశంపేట: దేశంలో, రాష్ట్రంలో ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలో నిర్దవెల్లి, లేమామిడి, కాకునూర్, సుందరపురం, కేశంపేట గ్రామాల్లో న్యాయయాత్రను మంగళవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీల్లో ప్రభుత్వం రెండింటిని అమలు చేసిందన్నారు. త్వరలోనే మరో రెండు హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే, ఎంపీలు కాంగ్రెస్ పార్టీకే చెందిన వారు ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. చల్లా వంశీచందర్‌రెడ్డిని నియోజకవర్గం దత్తత తీసుకుందని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. సుందరపురం గ్రామంలో నిర్వహించిన న్యాయ యాత్రలో మాజీ సర్పంచ్ రాములునాయక్ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, నాయకులు వీరేష్, శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, సుందరయ్య, భాస్కర్‌గౌడ్, యాదయ్యయాదవ్, కరుణాకర్‌రెడ్డి, అమేర్, రూప్లానాయక్, భాస్కర్ నాయక్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్నర్ మీటింగ్

షాద్‌నగర్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్ రెడ్డి అన్నారు. న్యాయయాత్ర మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరం, కిషన్‌నగర్, హాజిపల్లి, షాద్‌నగర్‌లో నిర్వహించారు. పట్టణ చౌరస్తాలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును చేపట్టిందని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాలేదని అన్నారు. చుక్కనీరు కూడా పంట పొలాలకు పారడం లేదని ఆరోపించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి కేంద్రంలో అధికారం చేపట్టడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, విశాల, తిరుపతిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, చెన్నయ్య, శివశంకర్‌గౌడ్, బాబర్‌ఖాన్, రఘు, ఇబ్రహీం, కాశీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.